మాదారంలో మెగా ఓపెన్‌కాస్ట్?



ఈ ఫొటోలో వ్యక్తి పేరు ముత్యాల రాజేశం. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్ నివాసం. ఎన్నో ఏళ్ల క్రితం మాదారంకు వలస వచ్చి సెలూన్‌షాప్ పెట్టుకొని జీవిస్తున్నాడు. అక్కడి వాళ్లలో ఒక్కడిగా కలిసిపోయాడు. ఇప్పుడు మాదారం ఊరు లేకుండా పోతదని తెలుసుకొని దిగులు చెందుతున్నాడు. పుట్టినూరును కాదని, బ్రతుకుదెరువు కోసం వచ్చిన ఊరు సుత లేకుండా పోయే పరిస్థితులు ఏర్పడటంతో తల్లడిల్లుతున్నాడు.

- క్వార్టర్ల కూల్చివేత మొదలు పెట్టిన సింగరేణి
- దశల వారీగా నిర్మాణాల కూల్చివేతకు ప్రణాళిక
- నిధులు వృథా.. అయినా వెనుకాడని యాజమాన్యం
- పట్టణ భవిష్యత్‌పై నీలి నీడలు



జేసీబీతో కూల్చివేస్తున్న కంపెనీ క్వార్టర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏరియా పురాతన కార్మికక్షేత్రం మాదారం టౌన్‌షిప్‌పై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బొగ్గు గనులు మూతపడిన ఈ ప్రాంతంలో కంపెనీ నిర్మించిన క్వార్టర్లను ఇతరప్రాంతాల మాదిరిగా రిటైర్డు కార్మికులు, పేదలకు అప్పగిస్తారని ఆశించగా అందుకు భిన్నంగా కూల్చివేతకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఎలాంటి ముందస్తు నోటీసులు కానీ, హెచ్చరికలు కానీ లేకుండా ఆకస్మికంగా వృథాగా ఉన్న క్వార్టర్లను ధ్వంసం చేయడానికి యాజమాన్యం పూనుకుంది. ఆఘమేఘాలతో మాదారం టౌన్‌షిప్‌లోని 561 నుంచి 758క్వార్టర్ల వరకు కూల్చివేసే ప్రక్రియను శనివారం ప్రారంభించింది. సింగరేణి అధికారులు తీసుకున్న ఈ హఠాత్పరిణామంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. 1979 ఏటా మాదారం టౌన్‌షిప్ ఏర్పడగా, ప్రస్తుతం 300కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరంతా మాదారం టౌన్‌షిప్‌తో పెనవేసుకుపోయి జీవితాలు వెళ్లదీస్తున్నారు.

మెగా ఓపెన్‌కాస్ట్ లో భాగమేనా..?

ఓపెన్‌కాస్ట్ ఏర్పాటు కోసం ఇటీవల సింగరేణి యాజమాన్యం నాన్ కోల్ బేరింగ్ ఏరియాను ధృవీకరిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ నోటిఫికేషన్‌లో మాదారం టౌన్‌షిప్‌ప్రాంతాన్నీ మ్యాప్‌లో పొందుపర్చింది. భవిష్యత్‌లో గోలేటి ఓపెన్‌కాస్ట్ కానీ, మహావీర్ ఖని(ఎంవీకే) ఓపెన్‌కాస్ట్ కానీ ప్రారంభమైతే మాదారం టౌన్‌షిప్‌పై ఓబీడంపింగ్ (మట్టి కుప్పలు) పోసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఓపెన్‌కాస్ట్ ప్రారంభమైన తర్వాత ఒకేసారిగా టౌన్‌షిప్ ఖాళీ చేయించడం కష్టతరమవుతుందనే ఉద్దేశంతో ముందస్తు జాగ్రత్తగా క్రమంగా క్వార్టర్ల కూల్చివేత చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సింగరేణి ఎస్అండ్‌పీసీ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షణలో గోలేటి, మహావీర్‌ఖని మెగా ఓపెన్‌కాస్ట్ ఏర్పాటులో భాగంగానే మాదారంలో క్వార్టర్లను ధ్వంసం చేయడానికి నిర్ణయం తీసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రక్రియను దశల వారీగా పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. క్వార్టర్లను కూల్చివేయడానికి టెండర్లను ఆహ్వానించాలనే తలంపులో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తుండగా, ఆ చర్య ఆచరణలో అమలైతే మాదారం టౌన్‌షిప్ కళావిహీనంగా తయారై ప్రభావాన్నీ కోల్పోవడం తథ్యమని చర్చించుకుంటున్నారు.

వృథాఖర్చు.. అయినా కూల్చివేతకే మొగ్గు..

మెగా ఓపెన్‌కాస్ట్‌కు అనుమతులు వస్తే ఎలాగూ మాదారం టౌన్‌షిప్ ఓబీ డంపింగ్ ఏరియాగా కంపెనీ వినియోగించుకుంటుందనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే మట్టి కుప్పలు పోసే ప్రాంతం కాబట్టి ఖాళీగా ఉన్న క్వార్టర్లకు కూల్చివేతలు ఎందుకు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వృథా ఖర్చు అయినపక్పటికీ యాజమాన్యం క్వార్టర్లను ఎందుకు పడగొట్టించాలని భావిస్తోందో అర్థంకాకుండా ఉంది.

తెల్లారేలోగా ఖాళీ చేయమంటున్నారు



సింగరేణోళ్లు క్వార్టర్లను కూల్చివేస్తండ్లు. ఖాళీగా ఉన్న క్వార్టర్లలో ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న మమ్మల్నీ ఉన్న ఫళంగా తెల్లారేలోగా ఖాళీ చేయమని హెచ్చరిస్తున్నారు. మా నాన్న సింగరేణి డ్యూటీ చేసినప్పటి నుంచి ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నం. అకస్మాత్తుగా వెళ్లమంటే ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు.
– గోమాస మహేశ్, మాదారం టౌన్‌షిప్

నలభై ఏళ్లు సింగరేణిలో పనిచేసినా..



నలభై ఏళ్లు కంపిన్ల పనిచేసి సింగరేణికి సేవలు అందించినా, బాయి పని దిగిపోయినంక ఇక్కడనే ఉంటున్న. వేరే ఏరియాల్లో ఇచ్చినట్లు మాదిరిగానే మాకుసుత ఇళ్ల పట్టాలు ఇచ్చి నిలువ నీడ కల్పించాలే. సింగరేణి అభివృద్ధిలో పాలుపంచుకున్న మాకు కంపెనీ తోడుగా ఉండాలే.
– దూదం మల్లయ్య, రిటైర్డు కార్మికుడు, మాదారం టౌన్‌షిప్

రక్తదానంలో సింగరేణి ఆదర్శం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: రక్తదానం చేయడంలో సింగరేణి ఉద్యోగులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ వీటీసీలో శిక్షణ పొందుతున్న యువ ఉద్యోగులు శనివారం రక్తదానం చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సరీల్లో జరిగిన ఈ కార్యక్రమంలో 20మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం వారికి జీఎం సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు అనేకమంది ఉన్నారన్నారు. వారికి రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా నిత్యం రక్తం అందిస్తున్నారని, ఇందులో భాగస్వామ్యం కావడం కోసం కంపెనీ ఉద్యోగులు రక్తదానానికి ముందుకొచ్చారన్నారు. వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ శ్రీరాంపూర్‌లో 51రక్తదాన శిబిరాల్లో 1350మంది ఉద్యోగులు రక్తదానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎంవీటీసీ మేనేజర్ కల్లూరి వెంకట రామారావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేశ్ బాబు, జేఎంఈట రాజకుమార్, ఫిట్ సెక్రెటరీ విజయలక్ష్మి, రెడ్డి క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, శంకర్ వర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి బోనాలు



బోనాల జాతరలో భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో శనివారం పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం పట్నాలు, గావుపిల్ల తదితర కార్యక్రమాలతో బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'జిల్లాలో పెరిగిపోతున్న రౌడీయిజం'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాలో మూడేళ్లుగా రౌడీయిజం, మాఫీయా సంస్కృతి పెరిగిపోతోందని, దాడులు, ప్రతిదాడులు, గంజాయి మత్తులో ఊగిపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని చార్వాక హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. యువత స్వార్థపరుల అరాచకాలకు బలైపోతున్నారని, చెడు మార్గంలో నడిచి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని తెలిపారు. విషసంస్కృతిని తిప్పికొట్టడానికి యువకులు, ప్రజాస్వామిక వాదులు, అభ్యుదయ వాదులు ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కనికరపు అశోక్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్, నస్పూర్ మండల శాఖ కార్యదర్శి మిడివెల్లి రాజు, నాయకులు పాయిరాల రాములు, సిడాం సమ్మక్క, తుమ్మ రేణుక, నాగజ్యోతి, బండారు రాజేశ్వరీ, సరిత, రమాదేవి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జన సంఘం పార్టీ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని వారం రోజుల పాటు చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి, బీజేపీ నాయకులు తులా మధుసూధన్‌రావు, జిల్లా మాజీ అధ్యక్షులు మున్నా రాజా సిసోడియా, గోలి రాము, లింగన్నపేట విజయ్‌కుమార్, అశోక్‌వర్ధన్, గుండ శ్రీనివాస్, రాపోలు ప్రభాకర్‌రావు, గుమ్ముల శ్రీనివాస్, బీమ్‌సేన్, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

'డెబ్బై పడకల ఆసుపత్రిగా మార్చే కుట్ర'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్: నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని 70పడకల ఆసుపత్రిగా మార్చే కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్ ఆరోపించారు. వంద పడకల ఆసుపత్రి భవనాన్ని శనివారం సందర్శించారు. చెన్నూర్, కోటపల్లితో పాటు వేమనపల్లి, పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి పునాది వేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా చేపట్టిన అభివృద్ధి ఏమి లేదన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ ప్రాంత ప్రజలపై ప్రేమ ఉంటే వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయించాలన్నారు. లేదంటే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాధన బోయిన కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, రాంలాల్‌గిల్డా, రెవెల్లి మహేశ్, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, నాయకులు మేడ సురేశ్‌రెడ్డి, ఆసంపల్లి సంపత్, భారతి, మానిశెట్టి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట ప్రభుత్వ వైద్య కళాశాలను డైరెక్టర్ అయేషా మస్రత్ ఖానం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పలు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, సీఐటీయూ నాయకులు శ్రీధర్, వినయ్ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే డిగ్రీ కాలేజీని కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాకు కేటాయించిన జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీను నిర్మల్ జిల్లాలో నిర్వహిస్తున్నారని, తిరిగి మంచిర్యాల జిల్లాలో కొనసాగించేలా చూడాలని కోరుతూ బీజేపీ గర్మిళ్ల అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. 2023–24 సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా 33నూతన బీసీ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయగా, మంచిర్యాల జిల్లాకు కేటాయించిన బీసీ డిగ్రీ కాలేజీను నిర్మల్ జిల్లాలో నిర్వహిస్తుండడంతో ఈ ప్రాంత విద్యార్థులకు దూరభారంగా మారి నష్టపోతున్నారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు దూరభారంతో పాటు, ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని, తిరిగి మంచిర్యాలలో కాలేజీని కొనసాగించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గర్మిళ్ల జోన్ ప్రధాన కార్యదర్శి మేరడికొండ శ్రీనివాస్, జయరాం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి, రెడ్డిమల్ల అశోక్, పూదరి రాంచందర్, కుర్రె చక్రవర్తి, బూర్ల చిరంజీవి, కొండ వెంకటేశ్ పాల్గొన్నారు.

'మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న మైనింగ్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుడు రాజా రమేశ్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి ప్రదాతగా పేరున్న మంత్రిని విమర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాతర్ల నాగరాజు, చెన్నూరి శ్రీధర్, ఈర్ల నారాయణ, అన్వర్, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, పెండ్యాల లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ పూర్తి



శిక్షణ పొందిన కార్యదర్శులతో డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీవోలు, రిసోర్స్ పర్సన్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. ప్రభుత్వ పరిపాలనా, సంస్కరణలు, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు కార్యదర్శులకు శిక్షణ ఏర్పాటు చేయగా, చివరి రోజు డీపీవో వెంకటేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. మెరుగైన స్థానిక పరిపాలన, సమాచార హక్కు చట్టం, సమాచారం వెల్లడించడంతో పారదర్శకత, గ్రామసభల బలోపేతం, మహిళా–స్నేహపూర్వక గ్రామ పంచాయతీలను ప్రోత్సహించడం, మహిళా సాధికారత, బాలల సంరక్షణ సంబంధిత ముఖ్యమైన చట్టాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ ముగింపులో రిసోర్స్ పర్సన్లు, ఎంపీవోలు అజ్మత్‌అలీ, వి.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, సతీశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాచారం

రేపు మినీ జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న ఉదయం 10.30గంటలకు మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ కంపెనీలో 100ఉద్యోగ ఖాళీల కోసం ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఫార్మసిస్టులు 40, ట్రెయినీ ఫార్మసిస్టులు 20, ఫార్మసీ అసిస్టెంట్‌లు 30, రిటైల్ ట్రెయినీ అసిస్టెంట్‌లు 10 పోస్టులున్నాయన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ చదివిన 18–35 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకొని, ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 82476 56356, 91211 71671, 91103 68501 సంప్రదించాలన్నారు.

జూలై 7న జెండా ఆవిష్కరణ

బెల్లంపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని జూలై 7న ఊరూరా సంఘం జెండాను ఆవిష్కరించనున్నట్లు బెల్లంపల్లి పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రామగిరి మహేశ్‌కుమార్ తెలిపారు. హన్మాన్ బస్తీలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ సాధించిన ఉత్సాహంతో ఊరూవాడ తేడా లేకుండా ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేసి పండుగ వాతావరణం ఉట్టిపడేలా చూడాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం కోసం రాష్ట్రస్థాయి ఎంపికల నిమిత్తం ప్రభుత్వ క్రీడా పాఠశాల హకీంపేట వద్ద నిర్వహించే పోటీలకు జిల్లా విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా యువజన క్రీడా అధికారి హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలతో ఈ నెల 30న మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటలలోపు హకీంపేట క్రీడా పాఠశాలలో హాజరుకావాలని తెలిపారు. జన్నారం మండలానికి చెందిన బోర్లకుంట విష్ణు తేజ, దవుల తన్విత్, వి.అభ్యాస్, జె.రిషివర్ధన్, అట్టెం శాన్విత శ్రీ, బోర్లకుంట మహిత, బండారి శృతిక, మందమర్రి మండలానికి చెందిన మాయ శ్రీయాన్, మిట్టకొల హన్షిత్, చిత్తారి అక్షయ, వేమనపల్లి మండలానికి చెందిన జి.అంజన్న, జి.నిహారిక, కె. శ్రీజ, ఎం.వర్షిని, బెల్లంపల్లి మండలానికి చెందిన కొట్ల హర్షిత్ సాయి, అర్సం చిన్మయి చిత్రిక, మంచిర్యాల మండలానికి చెందిన షేక్ నయిమ్, దండే శ్రీయాన్సీ, కాసిపేట మండలానికి చెందిన మేడ సహర్షవర్ధన్, కన్నెపల్లి మండలానికి చెందిన జాడీ అక్షరలు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు సకాలంలో హాజరుకావాలని, వివరాలకు 99635 39234 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

నేడు పెద్దమ్మ తల్లి బోనాల జాతర

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే కాలనీలో గల ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి బోనాల జాతరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. అనాదిగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఏటా ఆషాఢ మాసంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతర నిర్వహిస్తున్నామని నిర్వాహకులు గిరెల్లి మల్లయ్య, పందుల మదునక్కలు తెలిపారు. బోనాల జాతరకు చెన్నూర్‌తో పాటు చుట్టుపక్క గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిపారు. పెద్దమ్మ తల్లి బోనాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


దరఖాస్తుల ఆహ్వానం

వేమనపల్లి: కన్నెపల్లి మండలం కేజీబీవీలో బైపీసీ కోర్సు, ఉచితంగా నీట్, ఎంసెట్ ఈఏటీ కోచింగ్ నిర్వహించనున్నట్లు కేజీబీవీ ఎస్ఓ పద్మ తెలిపారు. నియోజకవర్గంలోని ఏ మండలం నుంచైనా ఆసక్తి కలిగిన బాలికలు బైపీసీలో చేరవచ్చన్నారు. మొత్తం 40సీట్లకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉచితంగా హాస్టల్, భోజనం, పుస్తకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఓపెన్ ప్రవేశాలకు..

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ పొందేందుకు జూలై 11లోగా దరఖాస్తు చేసుకోవాలని దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. మరిన్ని వివరాలకు దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

తాండూర్/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి దాగం రాజారాం శనివారం వేర్వేరుగా పిలుపునిచ్చారు. తాండూర్ మండలం బోయపల్లి బోర్డు వద్ద సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో శ్రీరాంపూర్‌లో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, బీఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, మందమర్రిలో ఏఐటీయూసీ నాయకులు సుదర్శన్, ఓదెలు, బానయ్య, శ్రీనివాస్, సంపత్, తాండూర్‌లో సీఐటీయూ నాయకులు బొల్లం రాజేషం, లచ్చన్న, రవీందర్, తిరుపతి, వెంకటేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పదవీ ప్రమాణ స్వీకారం

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ మంచిర్యాల నూతన కార్యవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఉదయం 10.30గంటలకు లయన్స్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ మధుసూధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి అధ్యక్షుడిగా కారుకూరి చంద్రమౌళి, కార్యదర్శిగా పోటు సుధాకర్ రెడ్డి, కోశాధికారి కుందారపు రామస్వామితోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ సురేష్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకించండి'

పాతమంచిర్యాల: ప్రజా కళాకారులపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న నిర్బంధాన్ని వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దాసు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో శనివారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ బిడ్డలను, ఉద్యమ కారులను చంపుతున్నారని విమర్శించారు. ఆదివాసీ పోరాటాలకు సంఘీభావం తెలుపుతున్నామని, ప్రజా ఉద్యమాలకు అరుణోదయ ఆట, పాటలతో సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులు మల్లన్న, ఉదయగిరి, చిరంజీవి, రాజన్న, వెంకన్న, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● 'ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి'

మందమర్రిరూరల్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సంధ్యారాణి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని సత్తా చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, నరేశ్, సంజీవరావు, శ్రీనివాస్, దీక్షితులు, జనార్దన్, రాయమల్లు, మోహన్ తదితరులు ఉన్నారు.

● సివిల్స్ రైట్స్‌డే నిర్వహించండి

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్‌లో ఈ నెల 30న సివిల్ రైట్స్ డే నిర్వహించాలని తహసీల్దార్ సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో, ఎస్సై, ఏఈ, ఏవో, ఎంఈవో, మెడికల్ ఆఫీసర్, వెటర్నరీలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

● బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

తాండూర్: మండలంలోని నర్సాపూర్ శివారులో వాగుపై బ్రిడ్జి నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ కోరారు. స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆదివాసీలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రోడ్ డ్యామ్‌ను పరిశీలించారు. వంతెన లేకపోవడం వల్ల గిరిజనులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో బాధిరావు, శ్యాంరావు, జంగు ఉన్నారు.

● విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

లక్సెట్టిపేట: విద్యార్థులు ప్లాస్టిక్‌ను నిషేధించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి అన్నారు. పాఠశాల ఆవరణలో శనివారం 'ప్లాస్టిక్ ఫ్రీ స్కూల్' అనే అంశంపై విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గీతాంజలి, శిరీష పాల్గొన్నారు.

● ఆర్థిక సాయం

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన బండారి లచ్చన్న తండ్రి లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఖర్చులకు ఇబ్బంది కలగకుండా అతడితో దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు శనివారం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : విజయ్ ప్రకాంత్ - 9440208447
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899